
# యూనిట్ III

# 9. చిన్నవస్తువులు

- నాళం కృష్ణారావు

**ఆలోచించండి-మాట్లాడండి**



**ప్రశ్నలు:**

1. పై చిత్రంలో ఏమేమి ఉన్నాయి?
2. అవి ఏం చేస్తున్నాయి?
3. అవి ప్రకృతికి ఎలా శోభనిస్తున్నాయి?
4. వాటిలో నీకు ఏది బాగా నచ్చింది? ఎందుకు?

**ఉద్దేశం:** ప్రకృతిలోని ఏ వస్తువునూ చిన్న చూపు చూడరాదని, ప్రకృతిని ఆస్వాదిస్తూ, ఆనందించాలనే విషయాన్ని విద్యార్థులకు తెలియజేయమే ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.







తే॥ చిన్న మొగ్గను వికసింపకున్న నేమి-
లోప మొక్కింత కలుగునే లోకమునకు?
అనుచు మొగ్గలు మూతులు ముడిచెనేని,
చల్లగాడ్పులు గోల్పోవు సౌరభములు
తరువులెల్ల కళారహితంబు లగును 1

తే॥ చిన్న చినుకును నే రాలకున్న నేమి
లోపమొక్కింత కలుగునే లోకమునకు?
అనుచు చినుకులు మబ్బుల నణఁగెనేని,
చెఱువు లన్నియు నెండి శుష్కించిపోవు
సస్యములు లేక నశియించు జంతుగణము 2

తే॥ చిన్ని చుక్కను నే నుండకున్ననేమి
లోప మొక్కింత కలుగునే లోకమునకు?
అంచు తారలు దివి నుదయించకున్న
చిన్నవోవును గగనంబు చెన్ను తఱిగి
నావ లల్లాడు కడలిలోఁ ద్రోవ తప్పి. 3

తే॥ చిన్ని దివ్వెను నే వెల్గకున్న నేమి
లోపమించుక కలుగునే లోకమునకు?
అనుచు దీపంబు వత్తుల నణఁగెనేని
చిమ్మచీకటి కడలెల్లఁ గ్రమ్మికొనుచు
లోకమంతయు నల్లకల్లోలమగును 4



తే॥ చిన్న కందును నే పుట్టకున్ననేమి
లోప మొక్కింత కలుగునే లోకమునకు?
అనుచు పసిపాప గర్భమందణఁగెనేని,
ప్రేమ యనునది లోపించు పృథివి యందు
క్రమముగా సృష్టియెల్లను సమసిపోవు. 5







© SCERT not to be republished

**కవిపరిచయం:**



1. కవిపేరు : నాళం కృష్ణారావు
2. కాలము : 20వ శతాబ్దం
3. బిరుదులు : మధురకవి
4. రచనలు : తేనెచినుకులు, పాలతరగలు, మీగడ తరకలు, వెన్నమీగడలు, గోరుముద్దలు మొదలైనవి.
5. శైలి : మధురమైన లలిత పదాలతో పిల్లలకు కూడా అర్థమయ్యే శైలి

**భావాలు**

1. నేనొక చిన్న మొగ్గను గదా! "నేను వికసించకుంటే లోకానికి ఏం లోపం కలుగుతుంది" అని మొగ్గలు వికసించకుండా ఉంటే, చల్లని గాలులు సువాసనలను కోల్పోతాయి. చెట్లన్నీ కళావిహీనంగా ఉంటాయి.
2. నేనొక చిన్న చినుకును గదా! "నేను నేలపై రాలకుండా ఉంటే కలిగే లోపమేముంది," అనుకొని చినుకులు మబ్బుల్లోనే దాక్కుంటే చెరువులన్నీ ఎండిపోతాయి. పైర్లు లేక జంతువులన్నీ నశిస్తాయి.
3. నేనొక చిన్న చుక్కను గదా! "నేను లేకుంటే లోకానికి కలిగే లోపమేముంది" అని నక్షత్రాలు ఆకాశంలో ఉదయించకుంటే ఆకాశం అందాన్ని కోల్పోయి చిన్నబోతుంది. సముద్రంలోని నావలు దారి తప్పి ఇబ్బందిపడతాయి.
4. నేనొక చిన్న దీపాన్ని గదా! "నేను వెలగకపోతే ప్రపంచానికి కలిగే నష్టమేముంటుంది" అని దీపం వత్తులలో దాక్కుంటే, కారు చీకట్లు అంతటా కమ్ముకొని లోకం అల్లకల్లోలం అవుతుంది.
5. నేనొక పసిపాపను గదా! "నేను పుట్టకుంటే లోకానికి వచ్చిన లోపమేమి?" అని పసిపాప గర్భంలోనే ఉండిపోతే, ప్రపంచంలో ప్రేమ నశించిపోతుంది. క్రమేణా సృష్టి ఆగిపోతుంది.

## ఇవి చేయండి

## I. వినడం-మాట్లాడడం



1. ఈ పద్యాలు మనకు దేన్ని గురించి తెలుపుతున్నాయి? పద్యాన్ని రాగభావయుక్తంగా చదవండి.
2. "చిన్న వస్తువులు" అని పాఠంపేరు విన్నప్పుడు పాఠంలో ఏం ఉంటుందని ఊహించారు?
3. 'చిన్నవస్తువులు' పద్యాలు విన్నారు కదా! దీనిద్వారా కవి ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారు.
4. ఈ పాఠానికి వేరే శీర్షిక పెట్టండి? ఆ శీర్షిక ఎందుకు పెట్టారో చెప్పండి?



## II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. ఈ పాఠంలో మొదటి పద్యాన్ని చదివి మొగ్గ ఏమనుకుంటున్నదో రాయండి?
2. "చిన్న చినుకును నేల రాలకున్ననేమి?" పద్యాన్ని చదివి మూడు ప్రశ్నలు తయారు చేయండి.
3. "చిన్న చుక్కను" ...పద్యం ఆధారంగా కింది పదాలను ఉపయోగించి వాక్యాలు రాయండి.

   (తారలు, గగనం, కడలి)




4. కింది పద్య పాదాలను సరియైన పదంతో పూరించండి.

   అ) చిన్నవోవును.................చెన్నుతఱిగి.

   ఆ) ............ లేక నశించు జంతుగణము.

   ఇ) తరువులెల్ల .................. లగును.



5. కింది పద్యపాదాలు తారుమారైనాయి. పాఠ్యాంశం ఆధారంగా క్రమంలో రాయండి.

   అనుచు పసిపాప గర్భమందణగెనేని
   క్రమముగా సృష్టి యెల్లను సమసిపోవు
   చిన్న కందును నే పుట్టకున్న నేమి
   ప్రేమయనునది లోపించు పృథివియందు
   లోపమొకింత కలుగునే లోకమునకు?

   ______________________________
   ______________________________
   ______________________________

6. కింది ప్రశ్నలకు రెండు మూడు వాక్యాలలో సమాధానాలు మీ సొంత మాటల్లో రాయండి.

   అ) చిన్న మొగ్గ వికసించకుండా ఉంటే ఏమవుతుంది?

   ఆ) దివ్వె వెలగకపోతే ఏమవుతుంది?

   ఇ) చినుకులు నేల రాలకుండా ఉంటే ఏమవుతుంది?



## III. స్వీయరచన



1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.

   అ) దీపం వెలుగునిస్తూ ఉంటుంది. అలాగే వెలుగు నిచ్చేవి ఇంకా ఏమేమి ఉన్నాయో ఆలోచించి రాయండి.

ఆ) మొగ్గ లేకపోతే చెట్లు కళాహీనమైపోతాయి. అలాగే చెట్లు లేని ప్రకృతి ఎలా ఉంటుందో ఊహించి రాయండి.

ఇ) "చూడడానికి చిన్నగా కన్పించే ప్రతి దాంట్లో కూడా ఏదో ఒక గొప్పదనం ఉంటుంది." దీన్ని సమర్థిస్తూ రాయండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) కవి ఈ పద్యాలను ఎందుకు రాసి ఉంటాడు?

ఆ) మీకు తెలిసిన మరికొన్ని చిన్నవాటి పేర్లు రాసి వాటి గొప్పదనాన్ని వివరించండి.

## IV. పదజాలం



**1. ఈ కింది వాక్యాలలో గీతగీసిన పదానికి అర్థాన్నిచ్చే పదాన్ని మీ పాఠ్యభాగంలో వెతికి రాయండి.**


అ) చల్లని గాలులు <u>సువాసనల</u>ను కోల్పోతాయి.

ఆ) వాన పడకపోతే చెరువులు <u>ఇంకి</u>పోతాయి.

ఇ) ప్రేమలోపిస్తుంది <u>భూమి</u> యందు.

ఈ) <u>సముద్రం</u>లో ఓడలు దారితప్పి అల్లాడిపోతాయి.


**2. కింది పదాలకు సమానార్థక పదాలు రాయండి.**




## V. సృజనాత్మకత



**కింది గేయాన్ని పొడిగిస్తూ రాయండి.**



చిన్న పూవును నేను
నేను లేక సుగంధ మంతరించు
సీతాకోక చిలుకను నేను
నేను లేక రంగుల శోభ తగ్గు
చిన్న కోయిలను నేను
నేను లేక ______
______
______
______





## VI. ప్రశంస



**ప్రతిదాంట్లో ఏదో ఒక గొప్ప లక్షణం ఉంటుంది కదా! అట్లే మీ తరగతిలోని ఎవరైనా ఐదుగురి పేర్లు రాయండి. వాళ్లలోని గొప్ప లక్షణాలు ఏమున్నాయో రాయండి. చిన్న వాటిని గురించి ప్రశంసిస్తూ రాయండి.**

## VII. భాషాంశాలు



**1. ఈ కింది పదాలను విడదీయండి.**

ఉదా॥ అ) ఏమంటివి = ఏమి + అంటివి = (ఇ + అ = అ)

పద్యభాషలో సంధి జరగనప్పుడు యకారం ఆగమంగా వస్తుంది.

ఆ) ఏమియంటివి = ఏమి + య్ + అంటివి = (ఇ + అ = య)

ఇ) వచ్చిరిపుడు = ______ + ______ = ______

ఈ) వచ్చిరియిపుడు = ______ + ______ + ______ = ______

పై సంధుల్లో హ్రస్వ 'ఇ' కారానికి 'అచ్చు' కలిసినపుడు సంధి జరిగింది. దీన్ని 'ఇత్వ సంధి' అంటారు. ఇది తప్పక జరగాలన్న నియమం లేదు. జరగవచ్చు. జరగకపోవచ్చు. వ్యాకరణంలో ఈ పరిస్థితిని 'వైకల్పికం' అంటారు.

**2. ఈ కింది పదాలను విడదీయండి.**

ఉదా॥ ఏమంటివి = ఏ<u>మి</u> + <u>అ</u>ంటివి = (మ్ +) అ + అ = మ

అ) కోవెలలోకేగినారు = ______

ఆ) పైకెత్తినారు = ______

ఇ) మనిషన్నవాడు = ______

**3. ఈ కింది పదాలను కలపండి. మార్పును గమనించండి.**

ఉదా॥ ఏమి + అన్నారు = (మ్ + ఇ) + అ

అ) అది + ఎట్లా = ______ = ______





ఆ) అతనికి + అందదు = ______ = ______

ఇ) మరి + ఎలా = ______ = ______

ఈ) ఎవరి + ఇల్లు = ______ = ______

ఉ) ఇది + అంతా = ______ = ______

## ప్రాజెక్టు పని

**పక్షులు, జంతువులు, సూర్యోదయం, అడవి... ఇలా అందమైన ప్రకృతి చిత్రాలు సేకరించండి. వాటి గొప్పదనం గురించి రాసి ప్రదర్శించండి.**



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | పద్యభావాలను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పద్యాలను రాగంతో చదివి, భావాలను రాయగలను. | ఔను / కాదు |
| 3. | చిన్న వస్తువుల గురించి కవిహృదయాన్ని అర్థంచేసుకొని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | గేయాల్ని పొడిగిస్తూ రాయగలను. | ఔను / కాదు |

*"చిన్నపనులు చేస్తూపోతే పెద్దపనులు వాటంతటవే దగ్గరికి వస్తాయి."*



© SCERT not to be republished